క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలి

కోదాడరూరల్ : సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు వికాస సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ఏసుపాదం అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడి చేతిలో సమాచారహక్కు చట్టం బ్రహ్మస్త్రంలాంటిదని, సామాన్యులకు అధికారులకు మధ్య చట్టం వారధిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో శివ, అహ్మద్, మజహర్, జగదీష్, లక్ష్మణ్, ముబీబ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహా పూర్ణాహుతి



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను గావించారు. అనంతరం ఆరగింపు, మంగళశాసనం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గురవయ్యగౌడ్, ఈఓ లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ



పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఫౌండేషన్ సభ్యుడు మిట్టపల్లి వెంకటేశ్వర్లు తన జన్మదినం సందర్భంగా వృద్ధులు, అనాథలు, మానసిక దివ్యాంగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు ఎస్‌ఎస్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మిట్టపల్లి నరసింహారావు–కాంతామణి దంపతులు, ఆశ్రమ నిర్వాహకులు వాచేపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ బండ కవిత తదితరులు

గరిడేపల్లి : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ పొందాలని తహసీల్దార్ బండ కవిత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కీతవారిగూడెంలోని దిరాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కెట్టుకొండ సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధాన్యంలో తాలు లేకుండా తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, ఏఈఓ రియాజ్, మాజీ ఎంపీటీసీ బాల్దూరి సందీప్, చింతకాయలు సైదులు, రామాంజీగౌడ్, సీఈఓ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండాలో హెచ్‌ఎస్‌ఎస్ బ్రదర్స్ లయన్స్ క్లబ్ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బంగారు స్వాతి మాట్లాడారు. వైద్యశిబిరంలో 110మంది పాల్గొన్నారని, వారిలో 36మందికి కంటి ఆపరేషన్లు చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు ఆర్గనైజర్ బాణాల వీరేందర్‌చారి, హెచ్‌ఎస్‌ఎస్ బ్రదర్స్ సభ్యులు, కార్యక్రమం నిర్వాహకులు గుగులోతు నరేందర్‌నాయక్, కోటయ్య ఉన్నారు.

నాగవల్లీ దళాలతో ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి, గోపాలపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆంజనేయస్వామికి నాగవల్లీ దళాలతో సహస్రనామార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బూరుగడ్డ దేవాలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఆయా ఆలయాల ఈఓలు ఎంపీ లక్ష్మణరావు, చలపతి, అర్చకులు ఉన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ప్రచారానికే పరిమితమైన సేంద్రియ ఎరువు తయారీ
- గ్రామాలలో ప్రధాన రోడ్ల వెంట దర్శనమిస్తున్న చెత్తాచెదారం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



బూరుగడ్డలో నిరుపయోగంగా ఉన్న షెడ్లు



వేపలసింగారంలో రోడ్డు వెంట వేసిన చెత్త



మిట్టగూడెంలో హెచ్చరిక బోర్డు పక్కన వేసిన చెత్త

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతో పాటు వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ చేయాలనే లక్ష్యంగా గత ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. కాని వాటి నిర్వహణను సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం షెడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. కొన్ని పంచాయతీల్లో ప్రారంభంలో కొంతమేర ఆసక్తి కనబర్చిన అధికారులు.. వాటిని పట్టించుకోవడం మరిచారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడిచెత్తను సేకరించి షెడ్లలోని కంపార్టుమెంట్లతో వేయాల్సిఉంటుంది. సేకరించిన చెత్తతో ఎరువులు తయారు చేసి ఆ ఎరువును రైతులకు విక్రయించి గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు ఆదాయం కల్పించడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం, స్వచ్ఛత మెరుగుపర్చాలని భావించింది. అధికారులు పట్టించుకోకపోవడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

తడి, పొడి చెత్త, కూరగాయలు, ఆహార వ్యర్థాలు, గడ్డి, పేపర్లు, కంపోస్టు గదుల్లో వేరుగా చేసిన అనంతరం వాటిని ఎరువులుగా మార్చి విక్రయించాల్సి ఉంది. అసలే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలకు ఈ విధానాన్ని పాటించి ఆదాయాన్ని మెరుగుపర్చుకోకుండా పంచాయతీ అధికారులు, సిబ్బంది ఏమి పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

రహదారుల వెంట చెత్తచెదారం..

మండలంలోని పలు గ్రామాల్లో చెత్తను సిబ్బంది డంపింగ్‌యార్డులకు తరలించకుండా రోడ్లు, డంపింగ్‌యార్డుల బయట పడవేస్తున్నారు. దీంతో చెత్త నుంచి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాలు వచ్చే అవకాశం ఉందని, అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్తను డంపింగ్‌యార్డులకు తీసుకెళ్లకుండా ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రహదారుల వెంట చెత్త వేసి కాల్చుతుండడంతో వచ్చే పొగకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మూలమలుపుల వద్ద చెత్త వేయడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులైనా సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కంపోస్టు ఎరువు తయారీకి చర్యలు చేపడతాం



తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే సిబ్బంది చెత్తను ఆ మేరకు సేకరిస్తున్నారు. కంపోస్టు షెడ్లు కొన్ని గ్రామాల్లో వినియోగంలోనే ఉన్నాయి. కంపోస్టు ఎరువును ప్రైవేట్‌గా కొనాలంటే కేజీ రూ.50ఉంటుంది. అదే గ్రామ పంచాయతీల్లో అయితే రూ.9 కేజీ ధర ఉంటుంది. సేంద్రియ ఎరువు తయారీ చేయించి పంచాయతీలకు మరింత ఆదాయం చేకూర్చేందుకు చర్యలు చేపడతాం.

– పిండిప్రోలు లావణ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, హుజూర్‌నగర్

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారిణి చంద్రకళ

అనంతగిరి : మండలంలోని వాయిలసింగారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మానిటరింగ్ అధికారిణి డి.చంద్రకళ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కేంద్రానికి వచ్చిన రైతులతో ఆమె మాట్లాడారు. సన్నరకం ధాన్యాన్ని ఎండబెట్టి తుర్పాల పట్టి కాంటా వేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు కల్లాల వద్ద తడవకుండా పట్టాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులకు పడకుండా మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఆమె వెంట కేంద్రం ఇన్‌చార్జ్ మోతుకూరి రాజారావు, రైతులు కొల్లు సుబ్బారావు, గద్దె శివరావు, నాగేశ్వరరావు, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ వయసుకే గాని మనసుకు కాదు



ప్రభాకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న డీటీసీ రాజారత్నం, ఎంఈఓలు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : ఉద్యోగ విరమణ వయసుకే గాని మనసుకు కాదని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జీసీ రాజారత్నం అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాతంగి ప్రభాకర్‌రావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభాకర్‌రావు ఒక పక్క వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. అనంతరం ప్రభాకర్‌రావు దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జితేందర్‌రెడ్డి, తీగల నరేష్, హుజూర్‌నగర్, గరిడేపల్లి, చిలుకూరు ఎంఈఓలు సైదానాయక్, చత్రూనాయక్, గురవయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పెనుగొండ శ్రీనివాస్, బొల్లు రాంబాబు, వేముల శ్రీనివాస్, ఎ.రాజశేఖర్‌రెడ్డి, అత్తి వెంకటేశ్వర్లు, పి.వీరబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు వెంటనే జమచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా నిధులు వారి ఖాతాల్లో వెంటనే జమచేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గానుగబండలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల విషయంలో ప్రభుత్వం చెప్పేదానికి చేసేదానికి పొంతనలేకుండా పోయిందన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా రైతులందరికీ నేటికి రుణమాఫీ చేయకుండా మాఫీ చేశామని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, షేక్ నబీసాహెబ్, ఈద సైదులు, పీరసాహెబ్, పోకల నర్సింహారావు, సైదయ్య, పాలేల్లి సైదులు, శేషమ్మ, సాంబయ్య, కాశయ్య, తిరపయ్య, తదితరులు పాల్గొన్నారు.

చట్టంలోని నిబంధనలు మారిస్తే ప్రతిఘటిస్తాం



మహాసభలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కార్మికుల సంక్షేమ చట్టంలోని నిబంధనలను మారిస్తే ప్రతిఘటిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని దొండపాడులో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సంక్షేమ చట్టంలోని నిబంధనలను ఆయా రాష్ట్రాలకు అనుకూలంగా మార్పులు చేస్తున్నారని అన్నారు. చట్టంలో నిబంధనలు దేశవ్యాప్తంగా ఒకే పద్ధతిలో ఉండాలని డిమాండ్ చేశారు. సభ్యుల సభ్యత్వం నమోదు, గుర్తింపుకార్డులు, రెన్యువల్, ప్రమాద నష్టపరిహారంతో పాటు 60ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని ఆయన కోరారు. వలస కార్మికులకు దేశంలో ఎక్కడైనా వర్తించే విధంగా గుర్తింపు కార్డులు ఉండాలని, సంక్షేమ బోర్డులను రద్దు చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21, 22తేదీల్లో హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఈ మహాసభల ప్రారంభం తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. మహాసభలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్కే లతీఫ్, కోశాధికారి సారెడ్డి రాఘవరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చిత్రియాల రవి, కార్మిక సంఘం నాయకులు మారుడి శ్రీనివాసరెడ్డి, జెట్టి ప్రసాద్, బాలశౌరి, హుస్సేన్, విద్యాచారి, వెంకటేశ్వర్లు, భాష, సైదులు, కాంతారావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర మరువలేనిది



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర మరువలేనిదని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మేడే నిర్వహణ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం పోరాడి సాధించుకున్న రోజు మే డే అని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్ ల పేరిట కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా మార్పులు చేస్తోందని వారు విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్. కృష్ణ, జె శ్రీను, ఐ .వెంకటేశ్వర్లు, వై .ఉమా, స్టాలిన్, జె. వెంకన్న, సైదులు, సురేందర్, ఎన్. వెంకటేశ్వర్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ సబ్‌స్టేషన్ పరిధిలోని 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ విద్యుత్ ఏఈ బాణోతు నరసింహనాయక్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసనగర్, హుజూర్‌నగర్‌రోడ్, ఆజాద్‌నగర్, బొడ్రాయిబజార్, టీచర్స్‌కాలనీ, నయానగర్, గోపిరెడ్డినగర్, భవనీనగర్, సూర్యాపేటరోడ్, రామ్మూర్తినగర్ ప్రాంతాలో ఉదయం 8గంటల నుంచి 11వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కొండాపురం ఫీడర్, ఆచార్యులగూడెం, పోలేనిగూడెం ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

17న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

హుజూర్‌నగర్ : పట్టణంలో నూతనంగా మంజూరైన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఈ నెల 17న హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి రాధారాణి వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు వినోద్‌కుమార్, లక్ష్మణ్, సుజన, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ ముఖ్యఅతిధులుగా పాల్గొంటారని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్ల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేక అర్చనలు, హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని పూర్తిచేసి నిత్య కల్యాణం నిర్వహించారు. అదే విధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం తరువాత మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

19న కిరాణా జనరల్ స్టోర్స్‌లో వస్తువుల విక్రయాలకు బహిరంగ వేలం..

మట్టపల్లి క్షేత్రంలో కిరాణా జనరల్‌స్టోర్స్, ఫ్యాన్సీ సామగ్రి విక్రయాల హక్కు కోసం ఈ నెల 19న ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఏడాది కాలానికి గాను నిర్వహించే ఈ వేలంలో పాల్గొనే వారు రూ.3లక్షలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మోతె : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని విభళాపురంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో సుమారుగా 30మంది సిబ్బందితో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు పలు నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా లైసెన్స్‌లు లేని 46మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వారిపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యాదవేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌రావు

నడిగూడెం : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీహెచ్‌పీఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కర్ల విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు నూకపంగు గుర్వయ్య, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి రావి స్నేహలతా చౌదరి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హుజూర్‌నగర్ : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మంగళవారం పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌లో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు రవిబాబు, దేశ్యా, సిబ్బంది నర్సింహారావు, నగేష్, ప్రశాంత్, వై.సైదులు, థియేటర్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి నివాళి



రత్నవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలుగూరి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి కలకొండ సాలమ్మన్, నాయకులు మొలుగూరి ప్రభాకర్‌రావు, విమల పంగు సైదిబాబు, కాంపాటి ప్రతాప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన సందర్భంగా మంగళవారం మండలంలోని వేణుగోపాలపురంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష, ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సంపతి లక్ష్మీనారాయణ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పందిటి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

హామీని అమలు చేసిన ప్రభుత్వం

మాదిగలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దున్నా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో 30ఏళ్లుగా జరిగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఫలితంగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కావడం హర్షణీయమన్నారు.

వంటపాత్రలు అందజేత



హెచ్‌ఎంలకు వంటపాత్రలు అందజేస్తున్న ఎంఈఓ

గరిడేపల్లి : మండలంలోని 37 ప్రభుత్వ పాఠశాలకు మధ్యాహ్న భోజనం వడేందుకుగాను ప్రభుత్వం వంట పాత్రలు అందజేసినట్లు ఎంఈఓ చత్రు నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సువర్ణ, కనకయ్య, నరసకుమారి, నాగమణి, ప్రసన్నకుమారి, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాలకు సామగ్రి బహూకరణ

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం, మంగళితండా ఆరోగ్య ఉపకేంద్రాలకు చిమిర్యాల సమీపంలో గల మిడ్‌వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం మంగళవారం రూ.1.50లక్షల విలువ చేసే వస్తు సామగ్రిని బహూకరించారు. నల్లబండగూడెం కేంద్రానికి రూ.లక్ష, మంగళితండాకు రూ.50వేల విలువ చేసే బెడ్స్, ఫ్రిజ్, గ్లూకోమీటర్, సెలైన్ స్టాండ్స్, వెయింగ్ మిషన్ టేబుల్స్, చైర్స్ ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ డీజీఎం చెంగల్ రాయులు, ఎస్‌పీఓ శ్రీనివాస్, హెచ్‌ఆర్ తరుణ్, డిప్యూటీ మేనేజర్ అరుణ్, నాగరాజు, నర్సులు అనిత, పరమేశ్వరీ, సుగుణ, నాయకులు శరభేశ్వరరావు, జబ్బార్ తదితరులు ఉన్నారు.

బేతవోలులో బడిబాట



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చందా శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

చిలుకూరు : ట్రాక్టర్‌ను బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బేతవోలు రోడ్డులోని కరక్కాయలగూడెం స్టేజీ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బేతవోలు రోడ్డులో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను బేతవోలు గ్రామానికి చెందిన ఏడుకొండలు బైక్‌పై వెనుక నుంచి వస్తూ బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఏడుకొండలు తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పశుఔషధ బ్యాంకుకు మందులు అందజేత

కోదాడరూరల్ : పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల పశుఔషధ బ్యాంకుకు రిటైర్డ్ ఎంఈఓ మీసా అంజయ్య మంగళవారం పలు రకాల మందులు అందజేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పెంటయ్య మాట్లాడారు. పెరటి కోళ్లకు సోకే కొక్కెర వ్యాధికి ఉచిత టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, చంద్రకళ, సాగర్, పశుపోషకులు తదితరులు ఉన్నారు.

నారాయణరెడ్డి సేవలు మరువలేనివి

అనంతగిరి : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముస్కు నారాయణరెడ్డి సేవలు మరువలేనివని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చనుపల్లి గ్రామంలో ముస్కు నారాయణరెడ్డి పదో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. చనుపల్లి గ్రామాభివృద్ధికి నారాయణరెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ముస్కు మధుసూదన్‌రెడ్డి, ముస్కు రమాణారెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి గురవయ్య, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగు నాటకరంగం దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

మఠంపల్లి : ఈ నెల 16న జరగనున్న తెలుగు నాటకరంగం దినోత్సవాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ కళాకారుల సంఘం అధ్యక్షుడు బోనగిరి ప్రకాష్‌బాబు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు నాటకరంగాన్ని, సంస్కృతి సంప్రదాయాలను మరుగునపడి పోకుండా కృషిచేస్తున్న సీనియర్ రంగస్థల కళాకారులను సన్మానించుకోవడంతో పాటు వారి సేవలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అందులో భాగంగానే మఠంపల్లిలో శ్రీ జ్యోతిప్రకాష్ యువజన నాట్యకళామండలి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగం దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమంలో కళాకారులంతా హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భద్రంరాజు వెంకటరామారావు, సీనియర్ కలాకారులు షేక్ సైదులు, భద్రయ్యాచారి, బొజ్జా సైదులు, షేక్ ఖాశిం, .ధర్మయ్యగౌడ్, జాల కిరణ్‌యాదవ్, వెంకటశివ, జగ్గయ్య, వీరమణి తదితరులు పాల్గొన్నారు.